మనసొల్లని మొగుడు
లేక
నీవేమంటావు??

—శ్రీ బచ్చల మునికన్నయ్య—

(గతసంచిక తరువాయి)

3

పరీక్ష ఫలితాల అనంతరం ఉపాధ్యాయ అభ్యసన పాఠశాలలో చేరాను. ఒక సంవత్సరం... (మూడు వందల అరవై ఐదు రోజులు) మూడు క్షణాలుగా మాయ మయ్యింది. సెలవుల్లో ఎందుకోమరి నాకే తెలియదు దిగువ పల్లెకు పొయ్యాను. రామన్న ఇంటిలో మకాం. రామన్న జరిగిన కథంతా పూస గ్రుచ్చినట్లు చెప్పాడు... కాని ప్రయోజనమేమి? గత జల సేతుబంధనము! నారాక పసిపట్టింది రామలక్ష్మి. రామన్న యింటికి వచ్చింది. నేను చూడలేక పొయ్యాను. లేచి ప్రక్కింటికి వెళ్ళాను. పాపం! పిచ్చి పిల్ల ఏడ్చింది నిలబడి. నిరాశతో యింటికి పోయింది. ప్రక్కింటిలో నున్న నేను, రామలక్ష్మి పోకను గ్రహించి మళ్లా రామన్న యింటికి వచ్చాను... మా అవ్వ "ఏమిరా! ఆలా ఆ పిల్ల వస్తే లేచి వెళ్ళావు?"

"అవ్వా! ఒక చెంబుతో నీళ్లు పట్టుకరా!"

"ఇందా నాయినా!" అని అవ్వ నీటి చెంబు నా చేతికి యీయబోయింది. "నాకు కాదవ్వా! ఆ చోట్లో నీళ్లు చల్లు" అన్నాను రామలక్ష్మి నిలిచిన చోటు చూపి. అమాయకంగా మా అవ్వ నే చూపిన చోట నీళ్ళు చల్లింది, అందరు పక్కన నవ్వారు. "చాలు లే నీవేళాకోళం" అని మొఖం మూరదు చేసుకొంది మా అవ్వ.

మరునాటి ఉదయం బయలుకుపోయి వస్తూ వున్నాను, నాగలి భుజాన పెట్టుకొని, కాడి గిత్తల తోలుకొని కయ్య కాడికి పోతూ యున్నాడు చెంగయ్య మామ. నేను అతని కంట పడ్డాను ఎదురుగా. మాట్లాడక తప్పలేదు.

"ఏమిరా! ఎప్పుడొచ్చావు?"

"నిన్న సాయంకాలం వచ్చాను."

"మరి యింటికి రాలేదేమి?"

"రావాలనుకున్నాను... కానీ......"

"జరిగిన దానిని మరచిపో నాయనా. విధి యెవరిని విడిచింది? తలవని తలంపుగా అన్నీ జరిగాయి. మధ్యాహ్నం భోజనానికిరా?"

"... అట్లే కానీండి." అని చెప్పి నేను రామన్న ఇల్లు చేరాను. చెంగయ్య చేనులోకి పొయ్యాడు. మధ్యాహ్నం భోజన సమయానికి మామగారు వచ్చి పిలిచాడు భోజనానికి. రామన్న కూడా "పో మామా! పెద్దాయనవచ్చి చేతులు పట్టుకొని పిస్తున్నాడు" అని ప్రేరేపించాడు. ఇక పోక తప్పదు. చిన్నగా పొయ్యాను చెంగయ్య ఇంటిలోనికి. సుబ్బన్న మడిలో మడక దున్నేట్లుగా వుంది. రామలక్ష్మి ఒంటరిగా యింట్లో వుంది. చెంబుతో నవ్వుతూ నీళ్ళు ఎత్తుకొనివచ్చి నా దగ్గర నిలబడింది. నేను తీసుకోలేదు. క్రిందపెట్టి పోయింది. చెంబు ఎత్తుకొని కాళ్ళు కడుగుకొన్నాను. చెంగయ్య వీధి తిన్నెమీద వున్నాడు. పీట ముందర వడ్డించిన విస్తరివుంది. పంచభక్ష్య పరమాన్నాలున్నాయి. కూర్చున్నాను పీట ముందర. కాని మనసు బరువైంది. కడుపు నిండినట్లుంది. ఒక పిడికెడు మ్రింగాను మందులాగ. మూగనోరు పడియున్నాను. "తిను మామా" అన్న

హీనస్వరం వినబడింది. తలెత్తి చూశాను. చాల బల హీనుడైపోయ్యా ననుపించింది.

"ఆహా! ఎంతటి మార్పు! ఆనాడు ముకుళితగా వుండిన రామలక్ష్మి పుష్పించిన గులాబి కన్యలా ఈనాడు! వికసించిన అరవిందానికి మంజుల మధుర రుచులను వెదజల్లే స్వేచ్ఛా పవన కుమారి దోహదం కరువైంది. కాబట్టే వాసన లేని పువ్వువలె వుంది రామలక్ష్మి. ఆ కాటుక కండ్లు. చెవులకు వ్రేలాడు జిమికీలు. నల్లని వాల్జెడ. పొంగి పోతున్న యవ్వన సౌందర్యాన్ని కప్పి పుచ్చుచుండు ఆ నిమ్మావళి చీర అంచులోని తేనెటీగల చిత్రాలు చూస్తూ యుంటే హృదయం ద్రవించి పోయింది. కాంతి మండలాల గుండా హృదయ దైన్య ప్రవంతి జల జలా పారి పోతూ వుంది. అయోమయంగా గొంతు రాలేదు నాకు మాట్లాడడానికి. సుబ్బన్న భార్య తాళి బొట్టులో నల్లని మచ్చ కనబడుతూ వుంది. వద్దన్నా నాలో యేవో భావాలు తోసుక వస్తూ వున్నాయి. ఇంతలో రామలక్ష్మి "తిను మామా" అని నా నిలబడిపోయిన హస్తాన్ని తన గులాబి చేతితో పట్టుకొని విస్తరవైపు వంచింది. నాకు కండ్లు కనబడటం లేదు. రామలక్ష్మి-కన్య కాదు. కాంత సుబ్బన్న ధర్మపత్ని. హిందూమత సాంప్రదాయానుసారం ఇతరుల భార్యలు తల్లులు కదా! స్త్రీ సాహసానికి లోబడరాదు మనిషి. కోపం వచ్చింది. హృదయం మండిపోయింది. "చా వదులు చేయి" అని విదిలించి లేచి చేయి కడుకొన్నాను. వీధి తిన్నెమీద కూర్చొనియున్న మామగారు "ఏమి నాయనా! భోంచేశావు కదూ!" అని అడిగాడు. "భోంచేశాను" అని జవాబిచ్చాను. నేను రామలక్ష్మి వలపు జ్యోతులని తెలిసికూడా తండ్రి యీలా దూరంగా వుండటం ఎంతవరకు న్యాయం? ఎవరు లేని గృహంలో నాకు రామలక్ష్మి చేతనే అన్నం పెట్టించడంలో రహస్యమేమి? ఇదేదో ఒక తంతు. లేక...పరీక్షో... అర్థం కాకుండావుంది. నాకు. ఏలాగో పాఠశాల పరీక్షలో తప్పిన యీ పరీక్షలో విజయుడైనానని నాకెంతో గర్వంగావుంది. తాంబూలము తెచ్చి యిచ్చింది రామలక్ష్మి. అప్పుడే సుబ్బన్న మడక విప్పి ఇల్లు చేరాడు. నా దగ్గర నిలిచియున్న రామలక్ష్మి సుబ్బన్న రాకనుచూచి లోపలికి వెళ్లుతుందేమోయని తలచాను. చెంగయ్య "పోమ్మా! నీళ్లీపో!" అని చెప్పాడు రామలక్ష్మికి "ముంచుకొని కడుకొంటాడులే కాళ్ళు చేతులు" అన్న రామలక్ష్మి మాటలు విని నేను "వస్తాను మామా" అని చెప్పి చక్కా రామన్న యింటికి వచ్చాను. నేను పోయి కూర్చున్నానో లేదో రామలక్ష్మి వచ్చింది అక్కడికి. రామన్న, అవ్వ మరి కొందరు బంధువులున్నారు. అందులో ఒక పెద్దామె "పాడు పిల్లను వూరకే చంపారు పాపం! ఇష్టంలేని మొగుడ్తో ఎంతకాలం కాపురం చేస్తుంది." అనీ అనక పూర్వమే అందుకొని నేను "పెద్దోళ్ళనే పేరే కానీ... ప్రయోజనం లేదు మీ మాటలు. బుద్ధి లేనోళ్ళకు బుద్ధి చెప్పాలి. కాని ఉన్న బుద్ధినీ పూడ్చి పెట్టేందుకు ప్రయత్నించరాదు. సంసార సతీపతుల్లో ఎన్ని ఎగుడు దిగుడులున్నా సరిచేసుకొని పోవాలి."

"అదికాదు నాయనా! సుబ్బన్న దీనికన్న చిన్నోడు. చిన్నప్పటినుండి 'సుబ్బన్నా! రారా! పోరా!' అని పిలుస్తూ వుండిన రామలక్ష్మి వాణ్ణి గౌరవించటం ఏలాగు చెప్పూ?"

"ఏలాగు గౌరవించాలంటావా? అనాడు తాళి కట్టేటప్పుడు ఏలాగు తలవంచి మెడ యిచ్చిందో ఆలా యీనాడూ - ఏ నాడూ - పతి చెప్పిన మాటలకు తలొగ్గి అన్ని పనులు చేసుకొంటూ పోతే... అన్నీ సాఫీగా సాగిపోతాయి. భర్తను పూజించటం వల్లనే భార్యకు రక్తి, భుక్తి, ముక్తి."

"వయసులో చిన్నోడైనా మాటల్లో గొప్పోడవే" అని ఆ పెద్దామె మంగళవాక్యం చెప్పింది. జొట జొట కన్నీరు కార్చుతూ రామలక్ష్మి కొంతసేపు నిలబడి "వస్తాను అవ్వా" అని చెప్పి ఇంటికి వెళ్ళింది. మరునాడు బయలుదేరి మా గ్రామం చేరుకొన్నాను.

4

పన్నెండు నెలలు పరుగున పోయ్యాయి. ఉపాధ్యాయ అభ్యసన పాఠశాల తుది వర్షాంతర పరీక్షలై

ఇంటికి వెళ్ళాం అందరు. మా గ్రామానికి ప్రక్కన పంచాయితీ ప్రాథమిక పాఠశాలలో నేను ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తూ యున్నాను. జాబు వచ్చింది... అత్తయ్య చనిపోయిందని... మేము ఎవరూ పోలేదు. మూడు నెలలు తిరగముందే రెండో పెండ్లిచేసుకొన్నాడు చెంగయ్య మరదలినే. ఆమెను పెండ్లి చేసుకోపోతే ఆస్తి పాస్తులు అన్యుల పరమౌతాయి కాబోలు. సంవత్సరం తిరిగే లోపల తనయుడు కలిగాడు చెంగయ్యకు. అనేక వర్షాలుగా కలలు గన్నది ఫలించింది. ఆనాటి నుండి రామలక్ష్మి మీద తండ్రి ఆదరాభిమానాలు తగ్గాయి. పెండ్లై మూడు వర్షాలు నిండినా భర్తను పక్క యిచ్చిన పాపాన పోలేదు రామలక్ష్మి. "లక్ష్మి" అని అనుంగు ప్రేమతో పిలిచే తల్లి దాటుకొంది. చిన్ననాడు సరస మాడిన మామగారు నీతులు రీతులు భాషించాడు. తండ్రి పుత్రికయై నా పుత్ర ప్రేమతో, ముద్దుగా "రాములూ!" అని పిలుచు తరుణం దాటిపోయింది. పుట్టిన బిడ్డ నోటిలో వెలువడు రంగారు, బంగారు రతనాల మాటలతో, రుచి పుట్టెడి తొక్కు పలుకులతో నూతన దంపతు లిరువురు నవసుధారసాన్ని గ్రోలుతూ స్వరంమర్చిపోతూ వున్నారు.

దిక్కులేని పక్షిలా, రుచులూరని జహ్వాలాగా, తన జీవితాన్ని యెంత కాలం గడుపుతుంది రామలక్ష్మి.

ప్రక్కపల్లె ప్రభాకర్ పడుచువాడు. యవ్వన పుష్పాంగులో కండ్లు తెలియని అంధుడు. ఏలాగో రామలక్ష్మిని తన వల్లో వేసికొన్నాడు. నిరీక్షిస్తూ వుండిన బికారికి చిక్కింది అమృత భాంఢమన్నట్లు రామలక్ష్మి ప్రపంచాన్ని నిరసిస్తూ ప్రభాకర్‌తో కామ లీలలకు కల్సుకొంది.

సుబ్బన్న వట్టి దద్దమ్మ. మొరటుబారిన దేహం. మందగించిన బుద్ధి. భార్యను సక్రమ పద్ధతిలో వుంచుకొనే సాహసంలేని సన్యాసి. తల్లిదండ్రులే దండించనప్పుడు తనకేమని తామసించిన అలసత పెద్దన్న. ఏమైనా మాట్లాడితే మాటకు పదిమాటలు వడ్డన జరుగుతుంది. "సంసారం గుట్టు, వ్యాధి రట్టు" అన్నట్లు — అరిస్తే మానం పోతుంది వీధిలో కూడా.

ప్రభాకర్ తల్లిదండ్రులు ప్రభాకర్ పోకడలు కనిపెట్టి చిన్న పిల్లైనా పరవాలేదని మేనత్త కూతురైన సుమతిని పెండ్లి చేశారు. ప్రభాకర్ "చిన్న పిల్లేకదా? సరేన"ని పెండ్లి చేసుకొన్నాడు. ప్రభాకర్ వలపు పవిత్రమైనది కాదు. క్షణిక తృప్తిపరుడు. భార్య యుక్తవయస్కురాలు కాదుకదా...? రామలక్ష్మితో రైలుప్రయాణం చేశాడు. నెల్లూరుచేరారు ఎవరికీ తెలియకుండా ఇరువురు. సంఘంలో, కుటుంబంలో గౌరవంలేదు కనుక రామలక్ష్మి ప్రభాకర్‌తో ప్రయాణానికి తను తొడిగిన నగలతో తరలి వచ్చింది. దాదాపు వేయి రూపాయల నగలు. ప్రభాకర్ వట్టి అపద్దాలకోరు. కాలానికి తగ్గట్లు పరుగులిడుతాడు. పోకపోతాడు. రామలక్ష్మి సాహసోపాయాలను మెచ్చుకొంటూ భట్రాజై పోతాడు అప్పుడప్పుడు. అందర్నీ మరిచింది రామలక్ష్మి. ఆరు మాసాలు హాయిగా గడిచి పోయింది. వున్న నగలు వలిచాడు ప్రభాకర్ ఇక మిగిలింది తాలి.

రామలక్ష్మి తండ్రి, భర్తలు ఆమె పోకకు సంతసించారే కాని - సంతసించలేదు - చచ్చిన దానితో లెక్కకట్టారు. ప్రభాకర్ తల్లిదండ్రులు చాల వెతికారు. తుదకు ఏలాగో ఆచూకి తీయగలిగారు. కాని ప్రభాకర్‌తో మాట్లాడేందుకు భయపడుతారు. యుక్తితోనే ప్రభాకర్‌ను ఇంటికి రప్పించాలనుకొన్నారు. "సుమతి పుష్పవతి అయింది. రేపటి శుక్రవారం నాటికి గృహప్రవేశం. నీవు తప్పక రావలయునని" ప్రభాకర్ అడ్రస్సుకు జాబు వ్రాశారు; జాబు సోమవారం చేరింది.

ఆ రాత్రంతా ప్రభాకర్ ఆలోచనా నిమగ్నుడై నాడు. 'కొత్తొక వింత పాతొక రోత' కదా మరి! ఏలాగో రామలక్ష్మిని లాలించి వూరు చేరాలనుకొన్నాడు. ఉదయం ప్రభాకర్ "రామలక్ష్మీ! తెచ్చిన నగలన్నీ తెగనమ్మి తిన్నాం. ఇక మిగిలింది

తాళి బొట్టు. ఎన్ని రోజులు యిక దీనితో బ్రతుక గలం? నేను యింటికి వెళ్ళి నా ఆస్తినంతా స్వాధీనం చేసికొని మనం ప్రత్యేకంగా రతీ మన్మధులవలె కాపురముంటాం. ఈ నాడే ఇంటికి పోతాం".

"అదిగో! మళ్లా నా మానం నలుగుర్లో పోగొట్టాలంటారా! వెలుపల పెట్టిన కాలు మళ్లా లోపల పెట్టమంటారా! అసలు మనల బ్రతుక నిస్తారా మీ వారు?"

"నీవు వెలవు సుమా! నా మాటకు ఎదురెవరు? మా గ్రామానికి పోకపోతే మానె - ప్రక్క పల్లెలో బాడుగ ఇంట్లో వుంటాం. చేతినిండా డబ్బు వుంటుంది. జల్సాగా బ్రతుకవచ్చు".

"మీ యిష్టం ఆలించినా, పాలించినా! వెలించినా!

"అయితే బయలుదేర?"

"బండి చార్జీలూ??"

"తాళిబొట్టు తెగనమ్మితే సరిపోతుంది."

"ఈ తాళిబొట్టా?"

"అవును. ఆ తాళిబొట్టే నిన్ను సర్వ విధాలా నాశనంచేసింది. సంఘం దానివల్లనే నిన్ను అనుమానిస్తూవుంది. అలాంటి చిహ్నం అసలుండరాదు."

"ఈ తెంపు తొలినాడే చేసివుంటే"... నని తన మేనమామను తల్చుకొని బోరుమని యేడ్చింది రామలక్ష్మి.

"చాలులే! నీ చాందస్తం! నీ వెప్పుడూ జరిగిన దానికి చింతించుతూ యుంటావు. జరుగుబోయేదూ జీవిత వారిధిని దాటుటెట్లని యుబలాట పడాలి. అంతే నాకు తెల్సింది." అని ప్రభాకర్ ధైర్య వాక్యాలు పల్కాడు.

"అయితే ఇంక మీ యిష్టం" అని తాళి తెంచి ఏడుస్తూ చేతికిచ్చింది. సాయంకాలానికి ప్రభాకర్ గ్రామానికి ప్రక్కపల్లె చేరారు ఇరువురు.

5

దైవ వశాత్తు సుమతి బుజువైంది సకాలానికి. మూడు మాసాల అనంతరం ప్రభాకర్ రామలక్ష్మిని అదోరకంగా చూస్తూ వచ్చాడు. రామలక్ష్మిని ఒంటరిగా యింట్లో వదలి స్వగ్రామానికి పోయి రెండు మూడురోజులుకూడా వచ్చేవాడుకాడు. స్నేహితులు బంధువులు ప్రభాకరుని మందలించేవారు అప్పుడప్పుడు. భార్య యుక్తవయస్సురాలైనాక కూడా వుంపుడు కత్తెను వుంచుకోవటం ఖ్యాతికి గొబ్బదెబ్బని కనబడ్డోళ్ళంతా ప్రబోధిస్తూ వున్నారు ప్రభాకర్‌కి. "రామలక్ష్మి నన్ను నమ్మి నాతో లేచివచ్చింది పచ్చని కాపురాన్ని పాడుచేసుకొని. నేనే సర్వమని విశ్వసించింది. ఏలాగుయిప్పుడు వదలివేయడం? వదలకుంటే పదుగుర్లో తలెత్తేదానికే వీలులేదే! ఇంట్లో సుమతి యీసడించుకొంటూ వుంది. తల్లి దండ్రులు దూరమయ్యే లాగున్నారు. స్నేహితులు హేళన చేస్తూ వున్నారు. ఈ పిల్లదానివల్లనే నా సంసారం కూడా పాడగుతూ వుంది. తన దగ్గరనే సదా వుండాలని రోధ పెట్టుతుంది ఎప్పుడూ - నా భార్య ఏమి కావాలో మరి! తిని పారవేసిన మామిడిముట్టె రామలక్ష్మి. నా రాణి సుమతి సుమంగళి. అందాల భరణి. నవ యవ్వన శోభలో వలపు సొంపుల వేడి ప్రవాహం స్వాగతమిస్తూ వుంది నాకు. ఈలాంటి సుమధురవలపు కౌగిటిని కాలరాసి... రామలక్ష్మిని యింకా నేను ఎందుకు ఆదరిస్తూ వున్నాను? దీనివల్ల అందరూ దూరమౌతూ యున్నారు. యశో కీర్తులకు గొప్ప అఘాత మేర్పడుతూవుంది. సంఘంలో గౌరవం నానాటికి సన్నగిలుతుంది. కుటుంబములో కొట్లాటలు కొల్లలుగా పుట్టుకొస్తున్నాయి. తన సంసారాన్ని స్వహస్తాల్తో నాశనంచేసిన... లచ్చిమి, నా కుటుంబాన్ని కూల దోయటంలో సందేహం లేదు? ఏలాగైనా యీ నాటితో దీనికి వీడ్కోలియ్యాలి"అని దృఢ నిశ్చయంతో ప్రభాకర్ ఆనాడు రామలక్ష్మి దగ్గరికి వచ్చాడు. రక్తారుణ నేత్రాలతో వున్న ప్రభాకరుని చూచి రామలక్ష్మి చాల భయపడింది. కన్నెత్తి చూసేందుకే సాహసించలేక

పోయింది. "ఏం! నీవల్ల నాపేరు ప్రఖ్యాతులు బొగ్గుపాలౌతున్నాయి, కీర్తి ప్రతిష్టలు బూడిదౌతున్నాయి. పో! ఎక్కడికైనా పో! నీ మొగుడు దగ్గరికిపో! లేకపోతేయే బావిలోనైనా పడిచావు... రెండు కాపురాలు సుఖపడుతాయి. కుల మర్యాదలు కుశల ప్రశ్నలు వేస్తాయి. పో! యిక నా కంటికి కనపడకాడు. లే" అని ప్రభాకర్ భీబత్స మాటలు విన్న రామలక్ష్మి హృదయంలో వెయ్యి జెట్టిపోతులు ప్రాకులాడి నట్లైంది. లక్షలాది తేళ్ళు కుట్టినట్లైంది. తల వేడెక్కింది. ఎదురు తిరిగి మాట్లాడక తప్పలేదు.

"ఏమండీ? మీరు నిజంగా మాట్లాడిన మాటలేనా ఇవి? ఎవరు చెప్పించారండీ యీలా తిట్టమని? నా తాడు తెంచి నన్ను కన్న యిల్లునుండి తరలించి... ఈనాడు అనాధనని, అబలనని కులటనని యీలా తూలనాడడం ఎంత న్యాయమండీ?" అని ప్రశ్నించింది రామలక్ష్మి.

"ఏమిటే! సృతిమించి రాగాన పడిందే నీ ప్రలాపం! ఇది లోకం! నీవేమిటే - నా గృహానికి రాణివేమిటి? అయ్యో పాపం! ఎంత జాణతనం? మన పొల్లని మొగునితో మాటాడకుండా వలపు కౌగిటిని యెడారి మయంగా చేసిన సంసారంలో "ఓయసిస్సు" లాగ నీ జీవితానికి సుధారసాన్ని ప్రసాదించినందుకు నీవు ఈలా మాట్లాడటం కృతజ్ఞతా? కృతఘ్నతా? చాలు నీ సాహసం. నీ సావాసం. ఇక సాగవు నీ సాని మాటలు! లే! లేచిపో! వెళ్ళిపో!!" అని ప్రభాకరు తన పాటను మేళవించి పాడాడు. పాపం! రామలక్ష్మి దిక్కులేని పక్షైంది. మారు మాటాడకుండా పాతకోక చంకనపెట్టి బయలుదేరింది ఎచ్చటికో? ఎవరికీ తెలియదు... కొందరు బావికి గుడ్డలు ఉతికేదానికి వెళ్లుతుందనుకొన్నారు... ఊరు దాటింది. ఆ వూరికి కొంత దూరంలో ఒక బావివుంది చాల లోతైన బావి. బావిదగ్గర నిల్చుంది రామలక్ష్మి ఆకాశం వైపు చూసింది. శూన్యం గోచరమైంది. తన జీవితం అంతేనని తలంచింది. తల్లిదండ్రులను తల్చుకొంది. "ఏం మొహం పెట్టుకొని వారి దగ్గరకు పోవటం... సుబ్బన్న ఏమనుకుంటాడు. మేనమామ దగ్గరకు పోతామా? నన్ను స్వీకరించడు. ఇంకెచ్చటికో ఏల? అఖిలేశ్వరుడు సర్వాలను సృష్టించి, రక్షించి, శిక్షించే - సర్వేశ్వరుని దగ్గరకే వెళ్లుతాను. ఈ పాతాళ గంగే ఆయన దగ్గరకి తీసుకొని పోవుగాక." అని తీర్మానించి రాము బావిలో పడింది కాబోలు.

ఈలా నా తల చింతించి చింతించి వేడెక్కింది... ఈ విషయాలనే పెక్కుమార్లు తల్చుకొంటూ వుంది. కోడికి నాను తెల్లవారింది.

ఉదయం బడికి సెలవు పెట్టాను. సాయంకాలం పార్కుకు వెళ్ళాను. రాజా నన్ను చూచి "ఏమి మోహన్ చాల చింతాక్రాంతుడవై వున్నావు?" అని ప్రశ్నించాడు. జరిగిన కధంతా చెప్పాను. "ఎవరు ఇందులో తప్పచేశారో నిర్ణయించమ"ని ప్రశ్న వేశాను. "మనపొల్లని మొగుడే" ఇందుకు ప్రబల్ల కారణ మన్నాడు. నీవేమంటావు?

కడుపునొప్పి, నోట నీరూరుట,
త్రేపులు, వాంతులు, మలబద్ధకము
లాంటి అజీర్ణ లక్షణములకు
కేసరి గారి
ఆదిత్య లవణము
దివ్య ఔషధము
వెల రు. 1-12-0
కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్,
మద్రాసు 14.